విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, సెప్టెంబర్ 4: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని ఎమ్మెల్యేకు ఫోన్ చేసి పాఠశాలలో వసతులు, సౌకర్యాలు సరిగ్గా లేవని చెప్పడంతో ఆయన పాఠశాలను సందర్శించారు. ఫోన్ చేసిన విద్యార్థినితో మాట్లాడిన ఎమ్మెల్యే పాఠశాల, వసతి గృహంలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపల్‌ను మొదలుకొని ఉపాధ్యాయుల వరకు ఎవరైనా విద్యార్థుల ఆరోగ్యం పట్ల కాని, అందించే ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించినప్పుడే విద్యార్థినులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వర్షాకాలం పాఠశాల, వసతి గృహం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ గౌతంకుమార్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు కేబుల్ రాజు ఉన్నారు.

శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

పేద మహిళ లకు అండగా ప్రభుత్వం

భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
ఇబ్రహీంపట్నంలో కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 4 : పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు సామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఓ గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పేదింటి ఆడపడుచులు తల్లిదండ్రులకు భారం కాకూడదని, వారి వివాహాల కోసం లక్షానూటపదహారు రూపాయల ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో సీఎం సహాయనిధి చెక్కులను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇబ్రహీంపట్నం మండలంతో పాటు ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీల పరిధిలో సుమారు 113మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.28లక్షలను అందజేశారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్‌చైర్‌పర్సన్ మంగ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గురునాథ్‌రెడ్డి, రమేశ్, రవీందర్ రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు సునిత, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

అతిథి అధ్యాపకుల పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, సెప్టెంబర్ 4: ఆమనగల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శార్వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, వాణిజ్యశాస్త్రంలో బోధించుటకు కనీసం 55 శాతం మార్కులతో పీజీ కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు 5తేదీ సాయంత్రం 4 గంటల లోపు ఆమనగల్లు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు
గడువు పొడిగింపు

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 4: బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రవేశాల గడువు పొడిగించినట్లు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 30వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులు అయినవారు ఈ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లను పొందవచ్చన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలకు గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్, 7382929657ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

శంషాబాద్ డీసీపీ రాజేశ్

కడ్తాల్, సెప్టెంబర్ 4: వినాయక మండపాల నిర్వహణలో నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో వినాయక చవితి, నిమజ్జనం ఏర్పాట్లపై మండపాల నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి కడ్తాల్ పోలీసులు శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీపీ రాజేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండపాల నిర్వాహకులు నిబంధనలను పాటించాలని సూచించారు. గణనాథుడిని ప్రతిష్టించే వారు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం డీసీపీని మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సత్కరించి, మట్టి గణపతిని అందజేశారు. సమావేశంలో తహసీల్దార్ ముంతాజ్, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు నర్సింహ, మహేశ్, శ్రీనివాస్, లక్ష్మయ్య, శంకర్‌నాయక్, మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, రామకృష్ణ, మజీద్ ఇమామ్ జహీరుద్దీన్, అహ్మద్‌జానీ, ఏఎస్ఐ నిరంజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆమనగల్లు : గణేశ్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్‌లో బుధవారం సీఐ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకొని పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి శంషాబాద్ డీసీపీ రాజేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులు ఉపయోగించేలా అవగాహన కల్పించాలని డీసీపీ పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, కమిషనర్ వసంత, ఎస్ఐ వెంకటేష్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాచారం : గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో యాచారం సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలపై యువజన సంఘాల నాయకులతో సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి పద్మజారమణి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎస్ఐలు మధు, సత్యనారాయణ, గోపాల్, పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, పలు గ్రామాలకు చెందిన యువకులు పాల్గొన్నారు.

కడ్తాల్ : సమావేశంలో మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్

సమావేశంలో మాటాడుతున్న జిల్లా సంక్షేమ అధికారిణి పద్మజారమణి

అధికారులు సమస్యలపై దృష్టి సారించాలి

జిల్లా సంక్షేమ అధికారిణి పద్మజారమణి

యాచారం, సెప్టెంబర్4: ప్రత్యేక అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా సంక్షేమ అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి పద్మజారమణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ రికార్డులను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శుల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని ఆమె హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 4: షాద్‌నగర్ పట్టణంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో గురు, శుక్రవారం ఉదయం 11గంటలకు కళాశాలకు రావాలన్నారు. కళాశాలలో ఎంపీసీ ఎస్సీ 11, ఓసీ 1, బీజెడ్స్ ఎస్సీ 1, ఓసీ 1, ఎంజెడ్స్ ఎస్టీ 2, ఓసీ 1, ఎంఎస్‌సీఎస్ ఎస్టీ 1, ఎస్సీ 5, ఎంపీసీఎస్ ఎస్సీ 1, బీసీ 1, బీకాం(కంప్యూటర్స్) ఎస్సీ 4, ఎస్టీ 1, బీకాం(జనరల్) ఎస్సీ 12, ఎస్టీ 2, బీఏ ఎస్సీ 14సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995660881ను సంప్రదించాలన్నారు.

బహుమతుల ప్రదానం

ఆమనగల్లు, సెప్టెంబర్ 4 : లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, జాతీయ అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి ర్యాలీ తీశారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఎన్‌పీసీబీ డాక్టర్ మోతీలాల్‌నాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి పరీక్షిత్ నరేందర్, చంద్రశేఖర్, బాలకృష్ణ, రమేష్, కొండల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాండు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

మంచాల, సెప్టెంబర్ 4: తెలంగాణ ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తహసీల్దార్ కేవీవీ ప్రసాద్ రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన ప్రతి ఉద్యమకారుడికి 250గజాల ఇంటి స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ ఉద్యమ కారులు చింతం రఘుపతి, గజ్జి ఐలయ్య యాదవ్, శేఖర్ ఉన్నారు.

పరిమితికి మించి బస్సుల్లో ఎక్కించరాదు

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 4: పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించరాదని ప్రైవేటు పాఠశాల యజమాన్యానికి ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో అధికారులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల బస్సులో పరిమితికి మించి అధిక సంఖ్యలో విద్యార్థులను పాఠశాలకు తరలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాలతో విద్యార్థులు బయటపడ్డారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో ఉన్న బస్సుల ఫిట్‌నెట్‌ను తనిఖీ చేసి, సరిగ్గా లేని బస్సులను సీజ్ చేసి పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రదీప్, అనిల్, కిషోర్, శివ, విజయ్, నితీశ్, ప్రణయ్, హరీశ్, విద్యార్థి, నాయకులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 4 : మతి మతిస్థిమితం లేని బాలిక అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన ఎండీ దస్తగిరి సోదరి ఫరిదా బేగం (16)కు మతిస్థిమితం లేదని, అప్పుడప్పుడూ తనకు ఫిట్స్ వస్తుందని తెలిపారు. ఈనెల 3వ తేదీ రాత్రి ఇంట్లోంచి ఫరిదా బేగం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. చుట్టు పక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఎండీ దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొడుకు రెండు కళ్లు దానం చేసిన తల్లిదండ్రులు

నందిగామ, సెప్టెంబర్ 4: మండల పరిధిలోని మేకగూడ గ్రామానికి చెందిన ప్రశాంత్ యాదవ్(29) సోమవారం రాత్రి కొత్తూరు దర్గా రోడ్డుపై బైకుపై మేకగూడకు వెళుతుండగా బైకు అదుపుతప్పి పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఆంజనేయులు అంగీకారంతో ప్రశాంత్‌యాదవ్ రెండు కండ్లను ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానకు దానం చేశారు.

ప్రశాంత్ యాదవ్ (ఫైల్)

రోడ్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
రావులపల్లి రోడ్డు, ఫతేపూర్ బ్రిడ్జి పరిశీలన

చేవెళ్లరూరల్, సెప్టెంబర్ 4 : రోడ్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫతేపూర్ బ్రిడ్జి పక్కన రోడ్డు, రావులపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు, మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు మోకిలాలోని విల్లాలలోకి నీళ్లు వచ్చిన నేపథ్యంలో స్థానిక నాయకులతో కలిసి ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రావులపల్లి గ్రామ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని, ఫతేపూర్ బ్రిడ్జి పక్కన కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాములుగౌడ్, బీజేపీ మున్సిపల్ ఇన్‌చార్జి వాసుదేవ్ కన్నా, మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, కౌన్సిలర్ రాములు, మాజీ ఎంపీపీ నర్సింహులు, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, పండిత్‌రావు ఉన్నారు.

ఫతేపూర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

ఆసరా పింఛన్ వెంటనే పెంచాలి

యాచారం, సెప్టెంబర్4: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకాకం ఆసరా పింఛన్‌ను వెంటనే పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసరా పథకం ద్వారా దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు అందజేయాలన్నారు. పింఛన్‌ను ప్రతి నెలా ఒకటవ తారీఖు నుంచి ఐదవ తారీఖు లోపు అందజేయాలని ఆయన కోరారు. కొంగరకలాన్‌లో ఏర్పాటు చేస్తున్న పాక్స్‌కాన్ కంపెనీలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణాలకు రూ.2లక్షల తక్షణ సహాయం అందజేయాలని ఆయన కోరారు. ఇబ్రహీంపట్నంలో అసంపూర్తిగా ఉన్న దివ్యాంగుల భవన నిర్మాణాలకు రూ.2లక్షల ఆర్థిక సాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను అందించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, నాయకులు జంగయ్య, బాల్‌రాజు, ఈశ్వర్, సంజీవ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇండ్లు కూలితే.. ఆర్థిక సాయం

మొయినాబాద్, సెప్టెంబర్ 4: వర్షాలకు ఇండ్లు కూలితే బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తమ్మల మణెయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలకు ఇండ్లు కూలిన వారికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. ఎవరివైనా ఇండ్లు కూలిపోతే ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్‌తో పాటు ఇల్లు కూలిన పొటోలను దరఖాస్తుకు జతపరిచి తహసీల్దార్‌కు అందించాలని సూచించారు.

భూ సమస్యలు
పరిష్కరించాలి

ఆమనగల్లు, సెప్టెంబర్ 4: ఆమనగల్లు మండలంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజల భూ సమస్యలు పరిష్కరించాలని బుధవారం డీఎస్‌పీ నాయకులు మండల తహసీల్దార్ లలితను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో డీఎస్‌పీ జిల్లా కార్యదర్శి వంకేశ్వరం రమేశ్, మండల నాయకులు ప్రవీణ్, శ్రీకాంత్, సురేశ్, మహేశ్ ఉన్నారు.

రవాణా చట్టాలను రద్దు చేయాలి

మొయినాబాద్, సెప్టెంబర్ 4 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రవాణా చట్టాలను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు జిల్లా కార్యదర్శి జె.రుద్రకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఆటో కార్మిక యూనియన్-సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాల వలన చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే కారకులైన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నూతన రవాణా చట్టంలో పొందుపర్చారని తెలిపారు. మరణానికి కారకులైన వారిపై రూ.10 లక్షల జరిమానా, ఏడు ఏండ్ల జైలు శిక్ష వేయాలని చట్టంలో పేర్కొన్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం రత్నం, మొయినాబాద్ మండల సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఆటో కార్మిక యూనియన్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి చెన్నయ్య, కోశాధికారి ఉస్మాన్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, బాబు, సహాయ కార్యదర్శులు వినోద్, హైమద్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మొయినాబాద్, సెప్టెంబర్ 4 : పోషకాహారంతోనే చిన్న పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ-2 టీచర్ కవిత ఆధ్వర్యంలో బుధవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. గుడ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని ఓ నమూనాలో ఏర్పాటు చేసి చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న నాటి నుంచే పోషకాహార లోపం లేకుండా మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని శాస్త్రవేత్తలు సూచించారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంధ్యరాణి, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు లక్ష్మి, శ్యామల, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో
నమోదు చేసుకోవాలి

ఆమనగల్లు, సెప్టెంబర్ 4: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆమనగల్లు మండలంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ పోలేపల్లి, కొత్తకుంట తండా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసి వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ అవకాశాన్ని రుణమాఫీ కాని రైతులు ఉపయోగించుకోవాలని ఏవో కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రభావతి, నిఖిత, భూదేవి, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

మంచాల, సెప్టెంబర్ 4: సేంద్రియ ఎరువులతో పంట సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు జి.కృష్ణ, డి.సుధీర్ పేర్కొన్నారు. బుధవారం మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు జి.కృష్ణ, డి.సుధీర్ హాజరై మాట్లాడారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సహజ వ్యవసాయ ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు వస్తాయని తెలిపారు. ప్రకృతిలో లభ్యమయ్యే నిమ్మ నూనె, వర్మీ కంపోస్ట్, పశువుల పేడ, కషాయాలతో సేద్యం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి నవీన, ఏఈవో సాయిసిరి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 4: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నతికి సహకారం అందించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయ్‌శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో తట్టిఅన్నారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లు అందజేశారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు.



కాలేజీ ప్రతినిధులతో కలిసి కంప్యూటర్లు అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్ గీతారెడ్డి

చెరువులు, కుంటలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

నందిగామ, సెప్టెంబర్ 4: చెరువులు, కుంటలతోపాటు కాల్వలు కబ్జాలకు గురికుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చేగూరు గ్రామ శివారులోని చెరువులు, కుంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, పాటు కాల్వలు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థల పేరుతో ధ్వంసం చేసి కబ్జాలు చేస్తున్నారని తెలిపారు. కబ్జాలకు గురికాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, టీడీపీ ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, కాల్వల పరిరక్షణకు ఉద్యమం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నందిగామ మండల బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల నర్సింహులు యాదవ్, నాయకులు సతీశ్, మారెడ్డి ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 4 : మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చేవెళ్ల మండల పరిధి తల్లారం అనుబంధ గ్రామం దుద్దాగులో కోనపురం నర్సింహులుకు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.